క్లుప్తంగా

చదువుతో ఉజ్వల భవిష్యత్


చదువు ప్రాముఖ్యతను వివరిస్తున్న గీతాలక్ష్మి

కోవెలకుంట్ల: మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను చదివిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని కలుగొట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై తల్లిదండ్రులకు అవగాహన లేక ఆడపిల్లల చదువును మధ్యలో మాన్పిస్తున్నారన్నారు. ఆడపిల్లల చదువు ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించాలని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో అన్నదానం


విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న ప్రిన్స్‌పాల్ భారతి

డోన్ టౌన్: స్థానిక జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అధ్యాపకులు విరాళాలతో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వివేకానంద సేవా సమితి సభ్యుల సూచన మేరకు కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ నవీన్ కుమార్, తల్లిదండ్రులు నాగన్న,లక్ష్మమ్మ దంపతులు మంగళవారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సహకరించిన నవీన్‌కుమార్‌కు ప్రిన్స్‌పాల్ భారతి, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : స్థానిక బుడగజంగాల కాలనీలో వెలసిన జంబులమ్మ దేవర మహోత్సవ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కాటసాని ఓబులరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కాటసాని ఓబులరెడ్డి కాలని అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో బుడగ జంగాల సంఘం నాయకులు సంకుల చిన్నస్వామి, జంబయ్య, శివకుమార్, బాలు, శేఖర్, చిన్నసుబ్బారాయుడు అర్జున్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కరపత్రాలు ఆవిష్కరణ


శివాలయంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో జరిగే ధార్మిక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యకలాపాల వివరాల కరపత్రాలను ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. గ్రామ శివాలయంలో నాలుగు రోజుల పాటు జరిగే శ్రీమద్రామయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచానాలు, భజనలు నిర్వహిస్తామని డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు మొదటి రోజు భజన నిర్వహించారు. చివరిరోజు శుక్రవారం గోపూజ, కుంకుమార్చన జరుగుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామచంద్ర రెడ్డి, అర్చకులు మహేశ్వరయ్య, రామిరెడ్డి, అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి


ఆకుమల్ల ప్రజలతో మాట్లాడుతున్న సీఐ జయ చంద్ర

సంజామల: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ జయచంద్ర సూచించారు. మండల పరిధిలోని నొస్సం, అక్కంపల్లె, ఆకుమల్ల,పేరుసోముల గ్రామాలలో కేంద్ర బీఎస్‌ఫ్ బలగాలు, బీఎస్‌ఫ్ ఇన్‌స్పెక్టర్ విక్రం సింహా, సంజామల ఎస్‌ఐ రమేష్ రెడ్డితో కలసి సీఐ కావాతు నిర్వహించారు. గ్రామ ప్రజలతో సీఐ మాట్లడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎవరు గొడవ పెట్టుకోవద్దుని, సమన్వయంతో మెలగాలని సూచించారు.

శింగనపల్లె అభివృద్ధి భళా!

- గ్రామ సచివాలయ పరిధిలో రూ.2.02 కోట్లతో అభివృద్ధి పనులు
- మజరా గ్రామం ఓబుళాపురంలోనూ పూర్తిగా మౌలిక వసతులు
- ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు పరిష్కారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అవుకు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పల్లెలు ప్రగతి బాట పట్టాయి. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పరుగులు పెడుతున్నాయి. అవుకు మండలం శింగనపల్లె గ్రామ పంచాయతీ తోపాటు ఓబుళాపురం గ్రామంలోనూ అభివృద్ధి భళా అనే జరిగింది. గతంలో శింగనపల్లె గ్రామంలో పొలాలకు వెళ్లే రస్తాలు సరిగాలేక రైతులు ఏళ్లతరబడి ఇబ్బందులు పడ్డారు. పంటల సాగుకు, దిగుబడులు తరలించేందుకు రైతుల కష్టాలు వర్ణనాతీతం. మజరా ఓబుళాపురం గ్రామంలో తాగునీటి కష్టాలతో ఇబ్బందులు పడేవారు. ఈ గ్రామానికి వెళ్లాలంటే గుంతలతో కూడిన మట్టి రోడ్డే గతి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ గ్రామాల ప్రజల అవస్థలు తీరాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో శింగనపల్లె, ఓబుళాపురం గ్రామాలను ప్రగతి బాట పట్టించారు. గ్రామాలకు చేరే మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చారు. గ్రామాల్లో గుంతలమయంగా ఉన్న దారులను సీసీ రోడ్లుగా మార్చి సుందరంగా తీర్చిదిద్దారు. పొలాలకు రహదారులు ఏర్పాటు కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మనబడి నాడునేడుతో కార్పొరేట్ పాఠశాలను తలపించేలా సర్వాంగసుందరంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లుతో శింగనపల్లె గ్రామం కళకళలాడుతుంది. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించి తాగునీటి కష్టాలకు చెక్ పెట్టారు ఎమ్మెల్యే కాటసాని. ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడంతో ఎమ్మెల్యే కాటసానికి శింగనపల్లె, ఓబుళాపురం గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం


రూ.35లక్షలతో ఓబుళాపురంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్



రూ.43.6లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం


గ్రామంలో సీసీ రోడ్డు వేసిన దృశ్యం


పొలాలకు వెళ్లే రస్తాల్లో గ్రావెల్ వేసిన దృశ్యం

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి సాధ్యపడింది



గతంలో శింగనపల్లె గ్రామం ఎలాంటి అభివృద్ధికి నోచుకోని దుస్థితి. ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కున్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ఎవరూ సహకరించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామ అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. దీంతో శింగనపల్లె గ్రామం అభివృ బాటలో నడుస్తోంది. ఎమ్మెల్యే పూర్తి సహకారంతోనే శింగనపనల్లె గ్రామ అభివృద్ధి సాధ్యపడింది. **– ముక్కమల్ల పుల్లారెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్, శింగనపల్లె గ్రామం**

ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డాం



మా గ్రామానికి రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు పడ్డాం. గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినప్పుడు ఈ రోడ్లలో ప్రయాణించేందుకు చాలా భయపడేవాళ్లం. వర్షాకాలంలో ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా ఉండేది. ప్రమాదాలకు జరిగిన సందర్భాలు కోకొల్లలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాన్ని పట్టి పీడీస్తున్న రహదారి సమస్యకు విముక్తి లభించింది. బీటీ రోడ్డు నిర్మించటం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. **– తలారి మధుకుమార్, ఓబుళాపురం గ్రామం**

పొలాల రస్తాలు మెరుగు పడ్డాయి



వ్యవసాయమే మాకు జీవనాధారం. అయితే శింగనపల్లె గ్రామ పొలాలకు వెళ్లే రహదారులు ఏళ్ల తరబడి అధ్వానంగా తయారయ్యాయి. పంటలు సాగు చేయటానికి వెళ్లాలన్నా, దిగుబడులను ఇళ్లకు చేర్చుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. తమ దుస్థితిని గ్రామ పెద్దలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. పొలాల రస్తాలు మెరుగుబడ్డాయి. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం. **– గుర్రాల సుదర్శన్ (రైతు), శింగనపల్లె గ్రామం.**

శింగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి వివరాలు

- రూ.43.60లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం
- రూ.23.94 లక్షలతో రైతుభరోసా కేంద్రం.
- ఓబుళాపురం గ్రామంలో రూ.35 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణం, రూ.5 లక్షలతో శింగనపల్లెలో తాగునీటి పైప్‌లైన్
- శింగనపల్లెలో రూ.20.53లక్షలతో ఎంపీయూపీఎస్ పాఠశాల, ఓబుళాపురంలో రూ.19.74 లక్షలతో ఎంపీపీఎస్ పాఠశాలల అభివృద్ధి
- ఓబుళాపురంలో రూ.5లక్షలతో శుద్ధజల కేంద్రం
- శింగనపల్లె నుంచి తాడిపత్రి రహదారిని కలుపుతూ ఓబుళాపురం మీదుగా 5 కిలో మీటర్ల పొడవునా రూ.3.05 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం
- శింగనపల్లె నుంచి సంగపట్నం వరకు 2.4 కిలోమీటర్ల పొడవునా రూ.70లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- శింగనపల్లెలోని ఓసీ కాలనీలో రూ.10లక్షలతో, బీసీ కాలనీలో రూ.8లక్షలతో, శివాలయం వీధిలో రూ.6లక్షలతో, ఓబుళాపురంలోని ఎస్సీ కాలనీ, పీర్లచావిడి వద్ద రూ.6లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- శింగనపల్లె గ్రామంలో రూ.5లక్షలతో చెన్నంపల్లె రస్తా నుంచి గులకంటి గుర్రప్ప పొలం వరకు, రూ.4.75లక్షలతో బిజ్జం పార్థసారథి రెడ్డి పొలం నుంచి ఎస్సార్బీసీ 12వ బ్లాక్ కెనల్ వరకు, రూ.4.85లక్షలతో కడంపల్లి రస్తా నుంచి ఎస్సార్బీసీ ప్రధాన కాలువ వరకు, రూ.5లక్షలతో ఆంజనేయ స్వామి మాణ్యం నుంచి నాలవేణివాగు వరకు గ్రావెల్ రోడ్ల నిర్మాణం
- గ్రామ పొలాల రహదారుల్లో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి మరో రూ.34లక్షలు నిధులు మంజూరు
- శింగనపల్లెలో రూ.1.20 కోట్లతో శరవేగంగా జరుగుతున్న వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణం

సంక్షేమ పథకాలు, అభివృద్ధి వైస్సార్‌సీపీకి అండ


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి బుగ్గన

- మంత్రి బుగ్గన సమక్షంలో 40 మంది వైస్సార్‌సీపీలో చేరిక

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు అండగా నిలుస్తాయని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నాల్గవ వార్డు కాలనీకి చెందిన 40 ముస్లిం సోదరులు టీడీపీని వీడి వైస్సార్‌సీపీలో చేరారు. శుకూర్ సాహెబ్, హబీబ్ బాషా, సయ్యద్ అహ్మద్, ఖాజా బాషా, ఖాజా, మున్నా, షఫీ, సుల్తాన్, హుసేన్ పీరా, మహబూబ్ బాషా, అశోక్, మద్దయ్యతోపాటు మరో 28 మందికి మంత్రి బుగ్గన వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా బుగ్గన మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దు అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలీ, ఖాజా, పట్టణ సచివాలయ కన్వీనర్ అజామ్ పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామం నుంచి నంద్యాలకు నాటుసారా తరిలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ ప్రియతం రెడ్డి మంళవారం తెలిపారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన దేశవత్ బాలు నాయక్ బుగ్గానిపల్లె తండా నుంచి నాటుసారాను ఎక్సెల్ వాహనంపై తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఈ మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

నాటుసారా విక్రేతలు అరెస్టు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె సెబ్ స్టేషన్ పరిధిలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించినట్లు సెబ్ స్టేషన్ సీఐ జోగేంద్ర మంగళవారం తెలిపారు. ఈ తనిఖీల్లో శింగనపల్లి గ్రామానికి చెందిన ఈడిగ ఆదిసుంకయ్య, ఈడిగ మునివరప్రసాద్‌గౌడ్ నుంచి 60లీటర్ల నాటుసారా, అలాగే కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన లచ్చమ్మ నుంచి 20లీటర్లు, తుమ్మల పెంట గ్రామానికి చెందిన గుళ్లగల్ల నాగేంద్ర నుంచి 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.


నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ

గ్రామ దేవతలకు పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు పాల్గుణ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. అదేవిధంగా అమ్మవారిశాల్లోని వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మ జాతర ప్రారంభం

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో పెద్దమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జాతర సందర్భంగా బంధువులు, స్నేహితులతో గ్రామం కిటకిటలాడింది. నందివర్గం ఎస్ఐ తిరుపాల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో పుట్టపెద్దమ్మ

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా సరళమ్మ

నంద్యాల(సెంట్రల్): నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకురాలిగా డాక్టర్ సరళమ్మ నియమితులయ్యారు. ఇది వరకు సహసంచాలకుడిగా పనిచేసిన డాక్టర్ ఎన్వీ వెంకటేశ్వర్లు గుంటూరులోని లామ్ ఫారంకు బదిలీ అయ్యారు. డాక్టర్ సరళమ్మ ప్రస్తుతం నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. పరిశోధన స్థానంలో కొత్త ఆవిష్కరణలకు పెద్దపీట వేసేలా తనకు అప్పగించిన బాధ్యతల్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని ఆమె తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

డోన్ టౌన్ : ప్రజల సమస్యల పరిష్కారానికి వార్డులలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. మంగళవారం పట్టణంలోని 6,7 సచివాలయాల పరిధిలోని 10వ వార్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వీధుల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. తాగునీరు, మురుగు కాలువల సమస్యల 10వ వార్డు ప్రజలు కిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ వెంట ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాబూబ్‌బాషా, 6, 7సచివాలయాల ఉద్యోగులు తదితరులు ఉన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

కొత్తగా ఓటు నమోదుకు గడువు

కోవెలకుంట్ల: 18 సంవత్సరాలు నిండి ఇప్పటి వరకు ఓటు లేని యువతి, యువకులు ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ జయప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటులేని యువతి యువకులు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తహసీల్దార్ జయప్రకాష్ తెలిపారు. కోడ్ వచ్చిన 24 గంటల్లోపే మండలంలోని అన్ని ప్రభుత్వ ఆఫీసులు, కార్యాలయాల ఆవరణాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నింధనలు పాటించాలని ఆయ సూచించారు.

జీవాలను అపహరించిన దుండగులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామంలో ఈడిగ శేఖర్‌గౌడ్‌కు చెందిన 22 జీవాలను గుర్తు తెలియని దొంగలు అపహరించారని ఎస్ఐ తిరుపాల్ మంగళవారం తెలిపారు. గ్రామస్తులు, ఎస్ఐ వివరాల మేరకు ఈడిగ శేఖర్‌గౌడ్ గ్రామ సమీపంలో షెడ్డు వేసుకొని ఆవులతో పాటు జీవాల పెంపకం చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జీవాల షెడ్డులోకి ప్రవేశించి, వాటికి మత్తు ఇన్‌జెక్షన్ ఇచ్చి, 22 జీవాలను ట్రాలీ ఆటోలో తీసుకెళ్లారన్నారు. జీవాల విలువ సుమారు రూ.మూడు లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. దొంగలు జీవాలను అపహరిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో రంగులు ఏర్పాటు

కొలిమిగుండ్ల: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో రంగులు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు రెవెన్యూ సిబ్బంది. మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రం నంబర్, ఏ నెంబర్ నుంచి ఏ నంబర్ వరకు ఓటర్లు ఈపోలింగ్ కేంద్రంలో ఓట్లు వేయాలో తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సమయం నాటికి పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సునీతబాయి చెప్పారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపుల ఏర్పాటు పనులు చేయనున్నట్లు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌కేసులో మంగళవారం నలుగురికి జైలు శిక్ష పడింది. ఎస్ఐ వరప్రసాద్ సమాచారం మేరకు.. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ అబ్దుల్ రహిమాన్ ఒక్కొక్కరికి నెల రోజులపాటు జైలు శిక్ష, ఒకరికి రూ. 10వేలు, మిగిలిన వారికి రూ. 2వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదలిన యువత

- 'యువత కోసం బుగ్గన' కార్యక్రమానికి తరలివచ్చిన యువత
- వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నుంచి కొత్తబస్టాండ్ వరకు భారీ ర్యాలీ
- కిటకిటలాడిన డోన్ ప్రధాన రహదారి

డోన్ : పట్టణంలోని మధు ఫంక్షన్‌హాల్ మంగళవారం నిర్వహించిన 'యువత కోసం బుగ్గన' కార్యక్రమానికి యువత కదలివచ్చింది. డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పల్లె నుంచి యువకులు మోటార్‌సైకిల్ ర్యాలీగా తరలివచ్చారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు దినేష్‌గౌడ్, ఆర్‌ఈ రాజవర్దన్, పోస్టుపసాద్, ఓబులాపురం మధన్, మల్యాల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా కొత్తబస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యువకులు పెద్దఎత్తున తరలిరావడంతో డోన్ ప్రధాన రహదారి కిటకటలాడింది. యువతీ, యువకులతో మధు ఫంక్షన్‌హాల్ నిండిపోయింది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితో కరచాలం చేసేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా మంత్రిని యువకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెంపల్లె రామచంద్రుడు, దొరపల్లె చిరంజీవి, ఎర్రిస్వామి, జయచంద్రారెడ్డి, ఓబులాపురం రమణ, దేవరబండ మధుసూదన్‌రెడ్డి, మల్కాపురం బద్దల నాగరాజు, రాజేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, మిట్టా రవికుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ

బనగానపల్లె : భూసార పరీక్షల ఆధారిత ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని యాగంటిపల్లి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ సూచించారు. మంగళవారం మండలంలోని యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీ మాట్లాడుతూ యాగంటిపల్లి కేవీకే, నేషనల్‌ఫర్టిలైజర్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భూసార ఆధారిత ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యం కాపాడుకొని పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని వ్యవసాయాన్ని రైతులు లాబాసాటిగా మార్చుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌ఎఫ్ఎల్ ఏరియా మేనేజర్ వంశీకృష్ణ, నంద్యాల సేల్స్ ఆఫీసర్ వినోద్‌నాయక్, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు పాల్గొని మట్టి నమూనాలు తీసుకునే పద్ధతులు, ఎరువుల యాజమాన్యం ప్రయోజనాలను వివరించారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

కొలిమిగుండ్ల: పదో తరగతి పరీక్షా కేంద్రాలను మంగళవారం మహానంది ఎంఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ రామసుబ్బయ్య పరిశీలించారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కేంద్రాలలో పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీరు అందుబాటులో ఉంచాలని ఎగ్జామ్ నిర్వాహకులకు సూచించారు.

ప్యాపిలిలో....

ప్యాపిలి: స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, సీఐ సుధాకర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. హిందీ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 817 మంది హాజరు కావాల్సి ఉండగా 43 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ తెలిపారు. 37 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 24 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

డోన్ టౌన్ : పట్టణంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సుభాన్, సోమశేఖర్ తనిఖీ చేశారు. పాతపేట జెడ్పీ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, ఓనైరో, నారాయణ, శ్యాంజో, మోడల్ స్కూల్, రెసిడెన్సియల్ స్కూల్ మొత్తం 9 కేంద్రాలను పరిశీలించా రు. విద్యార్థులకు కల్పించిన వసతులపై ఆరా తీశారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ ప్రితం రెడ్డి తెలిపారు. మండలంలో సమస్యాత్మక గ్రామమైన అంబాపురంలో ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సీఐ ప్రితం రెడ్డి రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. మీ విలువైన ఓటును మీ గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడే నాయకులకు వేయాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్స్ షేక్షావలి, పోలీసులు తిరుమలయ్య, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ప్రితం రెడ్డి